క్లుప్తంగా

అక్రమంగా మట్టి తవ్వకాలు..

పొక్లెయిన్ సీజ్



పలిమెల: మండలంలోని లెంకలగడ్డ సెక్షన్ పరిధిలో అక్రమంగా మట్టి తవ్వుతున్న పొక్లెయిన్‌ను సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ నాగరాజు శుక్రవారం తెలిపారు. సుమారు నాలుగు ట్రాక్టర్ల విలువ చేసే మట్టిని తరలించినట్లు పేర్కొన్నారు. మట్టి ఎక్కడికి తరలిస్తున్నారు.. వాహనం ఎక్కడిది అనే దానిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట మాజీ ఉపసర్పంచ్ నర్సింగరావు తల్లి రాంబాయి ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొడాలి రమేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా



కాటారం: మండల కేంద్రం నుంచి ధన్వాడ వైపుగా మట్టి లోడ్‌తో వెళ్తున్న లారీ మండల కేంద్రానికి సమీపంలోని డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో ఆకస్మాత్తుగా డివైడర్‌ను ఢీకొట్టింది. కొంత దూరం డివైడర్ పైనుంచి దూసుకెళ్లిన లారీ ఒక వైపుగా బోల్తాపడటంతో మట్టి మొత్తం రోడ్డుపై పడిపోయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి


పెద్దవీరయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆరెపల్లికి చెందిన కసుకుంట్ల పెద్దవీరయ్య(68) రోజులాగే స్థానిక హనుమాన్ గుడిలో ఆవరణలో నీటితో శుభ్రం చేసి గుడి తలుపులు తెరుస్తున్నాడు. ఈ క్రమంలో గేటు, మండపానికి పైన రేకుల మీదుగా ఉన్న సర్వీస్ వైరు పెలిపోయి ఉండడంతో గమనించక ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి పెద్దకుమారుడు రాజవీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

భూపాలపల్లి అర్బన్: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన భూపాపలల్లి పట్టణ శివారులోని బాంబులగడ్డలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాంబులగడ్డకు చెందిన గాజుల సారమ్మ(56) రెండేళ్లుగా బీపీ, కీళ్ల నొప్పులతో బాధడుతున్నట్లు తెలిపారు. అలాగే తన కొడుకు గాజుల మహేష్‌కు ఇద్దరు ఆడపిల్లల సంతానమని బాధపడుతూ ఈ నెల 20న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పతికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటి ఎదుట కట్టేసిన ఎద్దుల అదృశ్యం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీలోని ఇప్పలబోరుకు చెందిన గుర్రం కార్తీక్‌కు చెందిన రెండు ఎద్దులు అదృశ్యమైయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కార్తీక్ గురువారం రాత్రి ఇంటి ఎదుట రెండు ఎద్దులను తాడుతో కట్టివేశాడు. తెల్లవారు జామున లేని చూసేవరకు కనిపించ లేదు. దీంతో చుట్టు పక్కలా వెతికిన ఆచూకి లభ్యం కాలేదు. ఆ ప్రాంతంలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎద్దులను గుర్తుతెలియని దొంగలు తీసుకు వెళ్లారా, లేదా తాడు తెంపుకొని పారిపోయాయా తెలియాల్సి ఉంది. దాదాపు రూ.లక్ష విలువ గల ఎద్దులు కనిపించకపోవడంతో పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

కల్వర్టుల నిర్మాణమెప్పుడో?

- శంకుస్థాపన చేసి మూడు నెలలు
- ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనాదారులు


చిట్యాలలో ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ కల్వర్టు

చిట్యాల: మండలంలోని శాంతినగర్ శివారులో ఉన్న లోలెవల్ కల్వర్టు, టేకుమట్ల మండల శివారులో ఉన్న రెండు లోలేవల్ కల్వర్టులను హైలేవల్ కల్వర్టులుగా నిర్మాణం చేపట్టడానికి మూడు నెలల క్రితం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రూ.రెండు కోట్ల నిధులను కేటాయించి శంకుస్థాపన చేశారు. మూడు నెలలు గడుస్తున్న కనీసం కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. చిట్యాల నుంచి టేకుమట్ల మండలంతో పాటు తదితర గ్రామాలకు నిత్యం అనేక వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. కాగా లోలేవల్ కల్వర్టుపై ప్రయాణించేటప్పుడు డ్రైవర్లతో పాటు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మించాలని పలుమార్లు ఎమ్మెల్యేకు వినతులు అందించడంతో స్పందించిన ఆయన నిధులు కేటాయించిన ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించక పోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో తప్పని తిప్పలు..

శాంతినగర్ శివారులో ఉన్న లోలేవల్ కల్వర్టుకు వర్షాకాలంలో వెలిశాల గుట్టపై నుంచి వరద వస్తుంది. దీంతో అటుగా వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటారు. గతంలో లోలేవల్ కల్వర్టు మీదుగా వర్షపు నీరు వెళ్లడంతో వాహనదారులు, ఆర్టీసీ బస్సులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. వరద తాకిడి తగ్గిన తర్వాతనే ప్రయాణికులు భయంతో నెమ్మదిగా వాహనాలను దాటించుకుంటూ వెళ్లిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి లోలేవల్ కల్వర్టులను హైలేవల్ కల్వర్టులుగా నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ అనిల్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కాలేదు, ఉన్నత అధికారుల వద్ద ఫైల్ ఉందన్నారు. ఫైల్ పత్రాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

పీఏసీఎస్ అభివృద్ధి అందరి బాధ్యత

- చైర్మన్ తోటపల్లి ప్రశాంత్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రశాంత్

కాటారం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధి ప్రతీ ఒక్కరి బాధ్యతలా భావించాలని సంఘం చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తదితర అంశాల గూర్చి సీఈఓ ఎడ్ల సతీశ్ చదివి వినిపించారు. సంఘం ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాల మంజూరు, రుణాల బకాయిదారులపై లీగల్ యాక్షన్లు, సంఘం భవనం మరమ్మతు చర్యల కోసం సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు పంట రుణాల మంజూరు చేయడంతో పాటు పలు రకాల రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రుణగ్రస్తులు సకాలంలో రుణ బకాయిలు చెల్లిస్తే మరికొంత మంది లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఐలి రాజబాబు, చీమల సత్యం, జక్కుల అజయ్‌కుమార్, మారుపాక రాజేశ్వరీ, బాసని హిమాకర్, బండి రమేశ్, దండ్రు రాజయ్య, రైతులు వెంకట్రాజం, భూపెల్లి రాజు, కుంభం రమేశ్, సమ్మయ్య, రాజయ్య, పురుషోత్తం, సిబ్బంది గోపాల్, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

చిట్యాల: ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేందుకు చిట్యాల మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని టీడీపీ అడహక్ కమిటీ సభ్యులు కోడెల భద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిట్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం


ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

టేకుమట్ల: జమ్మికుంట–ఓడేడ్ వయా వెంకట్రావుపల్లి మీదుగా బస్సు సర్వీస్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. శుక్రవారం వెంకట్రావుపల్లి–ఓడేడ్, జమ్మికుంటకు బస్సు సర్వీస్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంచారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం


మొక్క నాటిన అధికారులు, సిబ్బంది

కాటారం: మండల కేంద్రంలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారిణి స్వాతి శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. డీఆర్వోలు సురేందర్, శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌ఓలు చంద్రశేఖర్, ఎఫ్‌బీఓలు జయలక్ష్మి, రాజ్‌కుమార్, సంజీవ్, రాజేందర్, అశోక్, జూనియర్ అసిస్టెంట్ మౌనిక, డీఈఓ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బయో మందుల విక్రేతపై కేసు

- రూ.6 లక్షల విలువైన మందులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ


సీజ్ చేసిన మందులు చూపిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలు బయో మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. శుక్రవారం ఏఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతుల్లేకుండా బయో మందులు నిల్వ చేసి ఉంచిన ఒక ఇంట్లో ఎస్సై తాజుద్దీన్ గురువారం అర్ధరాత్రి పోలీస్, అగ్రికల్చర్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆ ప్రదేశంలో రూ.6 లక్షల విలువైన బయోమందులను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కందిచర్ల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపురం కాలనీలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ ఎలాంటి అనుమతుల్లేకుండా బయోమందులు నిల్వ చేసి వెంకటాపురం(కె), చర్ల ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం అర్ధ రాత్రి పోలీస్, అగ్రికల్చర్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిల్వ చేసి ఉంచిన 410 లీటర్ల ద్రవపదార్థం, 30 కేజీల ఘన పదార్థం గల బయోమందులను పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బయోమందులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న వ్యక్తిపై శాఖా పరమైన కేసు నమోదు చేశారు. అతడి నుంచి వ్యానును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు.

శివాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు


స్తంభానికి అమర్చుతున్న సీసీ కెమెరాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ సంరక్షణ కోసం మూడు సీసీ కెమెరాలను సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ సాకారంతో ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ఆలయ, భక్తుల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం డైరెక్టర్లు ఇరవేణి రాంలాల్, ఇర్సవడ్ల కిరణ్, వలస తిరుపతి, కట్కూరి రాధిక, కర్ల అరుణ, దుర్గం కొమురయ్య, సోమందపు నర్సింహులు, పెద్దబోయిన అర్జున్, గార పోషలు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, తాండ్ర శ్రీను, కంపెల్లి భాగ్య, బట్టు ప్రవీణ్, పెద్దబోయిన యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

భూపాలపల్లి రూరల్: భారీ వర్షాలు, ఈదురు గాలులు వచ్చినప్పుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టడానికి హైపర్ అనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్చూర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి కార్యాచరతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

కార్మికుల ధర్నా

ఏటూరునాగారం: మూడు నెలలుగా వేతనాలు అందించడం లేదంటూ మిషన్ భగీరథ కార్మికులు శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు భగీరథ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడికి వెంటనే ఐడీ కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే వర్తింపజేయాలని తెలిపారు.

‘ఉపాధి’ పనులను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఓ గిరి హరీశ్


కూలీలకు అవగాహన కల్పిస్తున్న హరీష్

మల్హర్: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ గిరి హరీశ్ తెలిపారు. మండలంలో తాడిచర్లలో చేపడుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను శుక్రవారం ఏపీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పని చేస్తే, ఒక్క రోజుకి రూ.300 రూపాయల చొప్పున 100 రోజులకు రూ.30వేలు ఒక్క జాబ్ కార్డుపై పొందవచ్చని కూలీలకు వివరించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున అన్ని పని ప్రదేశంలో కూలీలకు మంచి నీళ్లు, టెంట్, మెడికల్‌కిట్లు ఏర్పాటు చేసినట్లు సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ బట్టు రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేడగాని రాజయ్య, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


టేకుమట్ల: నగదు అందజేస్తున్న నాయకులు


చిట్యాల: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు పండుగ అనిల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ పరామర్శించి పార్టీ నుంచి రూ.35వేల ఆర్థిక సాయం అందజేశారు. దొంతుల శ్రీనివాస్, కత్తి సంపత్, నాంపెల్లి వీరేశం, గుర్రపు సంపత్, అల్లం ఓదెలు, నూనేటి రమేష్, కోరె చందు, శాస్త్రాల కిరణ్, కుమార్, ఐలయ్య, బండి రవి ఉన్నారు.

చిట్యాల: మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన మోత్కూరి కుమారస్వామి ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతడితో పదో తరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. గంగాధారి రాజు, తిరుపతి, సతీశ్, రమేశ్, మోత్కూరి శ్రీశైలం, రాజేందర్, రాజు, ప్రభాకర్, మధుకర్, శైలేందర్, శ్రీధర్, రవీందర్, మహేందర్, గట్టయ్య, అశోక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పంట కొనడం లేదని ఫిర్యాదు

మల్హర్: ఓ సీడ్ కంపెనీ ఇచ్చిన విత్తనాలతో తాను పండించిన మొక్కజొన్న సాగు పంటను కంపెనీ ప్రతినిధులు కొనడం లేదని మండలంలోని రైతు ఆర్ని ప్రసాద్ కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన రైతు ఆర్ని ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ సీడ్ కంపెనీ ఇచ్చిన సీడ్ విత్తనాలతో తనకున్న మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేసినట్లు తెలిపాడు. కంపెనీ ప్రతినిధులు పంట సాగు చేసిన సమయంలో నాలుగు నెలల తర్వాత వచ్చితామే పంటను తీసుకెళ్తామని చెప్పారని పేర్కొన్నారు. ఇచ్చిన గడువు ముగిసి 15 రోజులు గడుస్తున్న రేపు, మాపు వస్తాం అంటూ ఇప్పటికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పంటను కోతులు, చిలుకలు, పందుల బెడద నుంచి కాపాడానికి ఇబ్బందులు పడుతున్నాని తెలిపారు. కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేస్తే స్పందిచండం లేదని, ఇప్పటికే ఎకరానికి రూ. 50 వేల ఖర్చు వచ్చిందన్నారు. పంటను తీసుకొని వెళ్లకపోతే తాను తీవ్రంగా నష్టపోతానని ఆందోళన చెందుతున్నాడు. ఈ విషయంపై వ్యవసాయ అధికారులకు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు, సిబ్బంది

చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అధికారుల సూచనలు మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, సింగిల్ ఫేస్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా తగు ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


చిట్యా: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


మొగుళ్లపల్లి: పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థులు


కాటారం: పరీక్ష కేంద్రాల వద్ద సౌకర్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



మల్హర్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

కాటారం: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులకు గాను 210 మంది, మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ(బాలుర) పరీక్ష కేంద్రంలో 198 మందికి గాను 198 మంది విద్యార్థులు, ఆదర్శ హై స్కూల్ పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులకు గాను 207 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. పరీక్ష కొనసాగుతున్న తీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నాగార్జునరావు, ఎస్సై అ భినవ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు 8:30 గంటలకు చేరుకున్నారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లు ఉపాధ్యాయులు పరిశీలించి లోపలికి అనుమతించారు. ఈ పరీక్ష కేంద్రంలో 152 మంది విద్యార్థులకు వంద శాతం హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కొయ్యూరు ఎస్సై నరేష్ పరిశీలించారు.

రేగొండ: రేగొండ మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు తెలుగు పేపర్‌కు రేగొండలో 180 మంది, రంగయ్యపల్లిలో117 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద రేగొండ ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో మొత్తం 403 విద్యార్థులకు అందరు హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

మొగుళ్లపల్లి: మండలంలో మొట్లపల్లి, మొగుళ్లపల్లిలో గ్రామాల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 266 మంది పదో తరగతి విద్యార్థులు ఉండగా మొదటి రోజు వంద శాతం హాజరైనట్లు మండల విద్యాశాకాధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎస్సై అశోక్ సందర్శించి బందోబస్తు నిర్వహించారు.

చిట్యాల: ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు గాను 159 మంది, సాంఘీక గురుకుల పాఠశాలలో 190 మంది విద్యార్థులకు గాను 189 మంది హాజరైనట్లు ఎంఈఓ కొడెపాక రఘుపతి తెలిపారు.

టేకుమట్ల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 136 మంది విద్యార్థులకు గాను 136 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు మండల విద్యాధికారి సుధాకర్ తెలిపారు.

గాయపడిన ఇద్దరికి ఎక్స్‌గ్రేషియా



వాజేడు: విద్యుత్ తీగల బారిన పడి గాయపడిన వారికి శుక్రవారం యానిమల్ యాక్సిడెంట్ స్కీమ్ ద్వారా ఎక్స్‌గ్రేషియాను నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు చేతుల మీదుగా అందించారు. మండల పరిధి కృష్ణాపురం గ్రామానికి చెందిన పూనెం ఏసుపతికి రూ 40,000, బురుక సాలయ్యకు రూ.80,000 విలువైన చెక్కులు అందించారు. 2022లో గాలి దుమారాల మూలంగా విద్యుత్ వైర్లు తెగి పడడంతో వీరు గాయపడ్డారు. దానికి గాను వారు దరఖాస్తులు చేసుకోగా.. అందుకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులు ఇప్పుడు వచ్చినట్లు విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్ తెలిపారు.